సాక్షి అనకాపల్లి

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



ముస్లింలకు అండగా..

ముస్లింలకు నాడు వైఎస్ఆర్ నుంచి నేడు జగన్‌మోహనరెడ్డి వరకు అండగా ఉన్నారని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. 8లో



సుజల స్రవంతిపై గ్రామసభలు

తుమ్మపాల : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులపై అనకాపల్లి మండలం బవులువాడ, కశింకోట మండలం రామన్నపాలెంలో జరిగిన గ్రామసభల్లో ఎస్‌డీసీ కె.రమామణి పాల్గొన్నారు.

మంత్రి అమర్నాథ్‌తో ఎస్పీ భేటీ



తుమ్మపాల: అనకాపల్లి జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.వి. మురళీకృష్ణ బుధవారం మంత్రి అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
6-17	4-22
నర్సీపట్నం	
6-20	4-21

న్యూస్‌రీల్

అనకాపల్లికి పీఎం అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్

తుమ్మపాల: ప్రధానమంత్రి అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్–2022 ఏడాదికి గాను అనకాపల్లి జిల్లా ఎంపికయ్యింది. స్వచ్ఛభారత్, హెల్త్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా అధిక ప్రాధాన్యత జిల్లాగా గుర్తించి ఈ అవార్డును ప్రకటించారు. అవార్డు ప్రధానోత్సవం ఢిల్లీలో ఈ నెల 21న జరగనుంది. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఢిల్లీ బృందం



నారాయణరాజుపేటలో రైతులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం సభ్యులు

మాకవరపాలెం: ఉపాధి పథకంలో చేపట్టిన పనులను ఢిల్లీ బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని నారాయణరాజు, తామరంలో చేపట్టిన పూడిక తొలగింపు, చెట్ల చుట్టూ నిర్మించిన ట్రెంచ్‌లు, పారంపాండ్‌లను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ పనుల వల్ల రైతులకు కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణశ్రీతో ఉపాధి పనులపై చర్చించారు. ఈ బృందంలో అమర్ సక్సేనా, మనోజ్‌కుమార్ ఉన్నారు.

పలువురు జడ్జిలకు బదిలీ

విశాఖ లీగల్: విశాఖలోని సీనియర్ సివిల్ జడ్జిలకు బదిలీ జరిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర హైకోర్టు బుధవారం న్యాయమూర్తులకు స్థానచలనం కలిగించింది. నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతిని గుంటూరు రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, అనకాపల్లి రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి హెచ్.అమర రంగేశ్వరరావును స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు బదిలీ అయ్యారు. గుంటూరు లోక్ అదాలత్ కె.రత్నకుమార్ విశాఖలోని ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. విశాఖలోని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి జె.సుజాత కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నగరంలోని రెండో అదనపు సివిల్ జడ్జి వివేకానంద్ వస్తున్నారు. అనంతపురం జిల్లా కదిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు విశాఖలోని రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వస్తున్నారు. విశాఖలోని ఆరో అదనపు సివిల్ జడ్జిగా గుంటూరు నుంచి జి.చంద్రమోళేశ్వరి బదిలీపై వస్తున్నారు.

11 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో రోజురోజుకూ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. బుధవారం 251 మందికి పరీక్షలు నిర్వహించగా.. 11 మందికి కరోనా నిర్ధారణ అయింది. 10 మంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 33 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 31 మంది హోం ఐసోలేషన్ ఉండగా, ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వడదెబ్బతో తాపీమేస్త్రి మృతి

బుచ్చెయ్యపేట: వడ్డాదికి చెందిన తాపీమేస్త్రి దొండా గోవర్ధనరావు (55) వడదెబ్బతో మృతి చెందాడు. ఇతను వారం రోజులుగా అనకాపల్లిలో తాపీ పనులకు వెళ్లి వస్తున్నాడు. ఐదు రోజులుగా ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇతను వడదెబ్బకు గురయ్యాడు. బుధవారం అనకాపల్లి కూలి పనులకు వెళ్లి ఆరోగ్యం బాగుండకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చేశాడు. ఇంటి వద్ద కుప్పకూలి పడిపోయాడు. కుటుంబ సభ్యులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించేలోపే అతను మృతి చెందాడు. గోవర్ధనరావు భార్య సత్యవేణి మూడేళ్ల క్రితం జబ్బుతో మృతి చెందింది. గోవర్ధనరావుకు ఇంటర్ పూర్తి చేసిన కుమార్తె స్వాతి ఒక్కర్తె ఉంది. తండ్రి మృతితో ఒంటరైన స్వాతి రేపటి నుంచి ఎలా బతకాలో అని విలపించింది. కుటుంబ సభ్యుల సహకారంతో తండ్రికి తలకొరివి పెట్టింది.

బాల... ఇకపై సబల

- బాలికల ఆత్మరక్షణకు తైక్వాండోలో తర్ఫీదు
- ప్రభుత్వ పాఠశాలల్లో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమం
- జిల్లాలో 242 హైస్కూల్, 179 ప్రాథమికోన్నత పాఠశాలల్లో శిక్షణ
- 7,8,9 తరగతుల బాలికలకు శిక్షణ తరగతులు



పాఠశాలలో తైక్వాండో శిక్షణ పొందుతున్న బాలికలు



తుమ్మపాల: ఆడపిల్లలకు అణకువతో పాటు ఆపద సమయంలో ఎదిరించే పోరాట పటిమ కూడా చాలా అవసరం. ప్రస్తుత సమాజంలో చిన్న పెద్ద తేడా లేకుండా ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకట్ట వేయాలంటే ఝాన్సీ లక్ష్మీబాయిలా ఎదిరించే ధైర్యం, నైపుణ్యం ఉండాలి. అందుకే ప్రభుత్వం ఆడపిల్లలకు ఆత్మరక్షణగా మాస్టర్ ఆర్ట్స్‌లో ఉచితంగా తర్ఫీదునిస్తున్నారు.

జిల్లాలో 40 వేల మందికి శిక్షణ

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా బాలికలు ఉండే పాఠశాలల్లో 242 జిల్లా పరిషత్ పాఠశాలలు, 179 అప్పర్ ప్రైమరీ పాఠశాలను ఎంపిక చేసింది. జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిది తరగతుల బాలికలు 28వేలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల బాలికలు 12 వేల మంది, మొత్తం 40 వేల మంది శిక్షణ పొందుతున్నారు.

వారానికి మూడు రోజులు

జిల్లాలో ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లోను మాస్టర్ ఆర్ట్స్‌పై నైపుణ్యం కలిగిన శిక్షకులు గల సంస్థగా గుర్తింపు పొందిన సంస్థలను ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో నియమించింది. వారిచే వారానికి మూడు రోజుల పాటు బాలికలకు ప్రత్యేక తరగతుల ద్వారా మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. రోజుకు గంట పాటు బాలికలకు శారీరక, థియరీ పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో రెండు నెలల పాటు శిక్షణలో భాగంగా నెలకు 12 తరగతులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ ఏడాది 1 మార్చి నుంచి ఏప్రిల్ 25 వరకు తరగతులు జరుగుతాయి. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో పాఠశాల పిల్లలకు శిక్షణ బాధ్యత 'బండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ పొందింది. ఈ సంస్థ మండలానికి ఒకరు చొప్పున శిక్షకులను కేటాయించి పాఠశాలల్లో బాలికలకు మాస్టర్ ఆర్ట్స్‌పై తర్ఫీదు ఇస్తుంది. పాఠశాలల సంఖ్య ఎక్కువగా ఉన్న మండలాల్లో ఇద్దరు చొప్పున శిక్షకులు బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 28 మంది నిష్ణాతులైన శిక్షకులు బాలికలకు తైక్వాండోలో తర్ఫీదునిస్తున్నారు.

సిల్వర్ మెడల్ గెలుచుకున్నా



నేను కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాను. జిల్లా స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ పొందాను. పాఠశాల విద్యా సంవత్సరంలో కనీసం ఆరు నెలలు తక్కువ కాకుండా శిక్షణ ఇవ్వాలని కోరుతున్నాను.

–పి.కావ్యశ్రీ

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది



బాలికల ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచితంగా నైపుణ్యం పొందడం బాలికలకు మంచి అవకాశం. ప్రభుత్వం బాలికల సమస్యలను దృష్టి లో పెట్టుకుని మంచి పథకాన్ని అమలు చేస్తోంది. పూర్తిస్థాయిలో బడిఈడు పిల్లలు ఈ శిక్షణ ద్వారా శారీరకంగాను, మానసికంగాను దృఢపడుతున్నారు. ఈ శిక్షణ అనంతరం బాలికలు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా క్షేమంగా వారంతట వారే బయటపడగలరు. నైపుణ్యం గల శిక్షకులే శిక్షణ ఇస్తున్నారు.

–సీహెచ్.చంద్రశేఖర్, శిక్షకుల జిల్లా ఇన్‌చార్జి

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం







విశాఖ విమానాశ్రయంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు మాధవి, సత్యవతి

గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా సీఎం జగన్ ప్రత్యేక విమానంలో బుధవారం 9.15గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో 9.39 గంటలకు శ్రీకాకుళం జిల్లాకు బయలు దేరారు. అక్కడ పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 2.34 గంటలకు గన్నవరం బయలుదేరారు. ముఖ్యమంత్రికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు బి.సత్యవతి, జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ తదితరులు స్వాగతం, వీడ్కోలు పలికారు.

సరుగుడులో పని చేయని సెల్‌టవర్

- సచివాలయ సేవలకు విఘాతం
- 30 గ్రామాల గిరిజనులకు అవస్థలు

నాతవరం: సరుగుడు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ అయిదు రోజులుగా సిగ్నల్స్ లేక మూగబోయింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సెల్ టవర్‌పై ఆధారపడి సరుగుడు పంచాయతీ శివారు రాజవరం, రామన్నపాలెం, అచ్చెంపేట, మాసంపల్లి, యరకంపేట, దద్దుగులు, సుందరకోట పంచాయతీ శివారు ఎనిమిది గ్రామాలు, కష్టాపురం, వెదురుపల్లి పంచాయతీలో పలు గ్రామాలు, కొయ్యూరు మండంలో ఆడాకులు కొత్తూరు, మాడుగుల తదితర గ్రామాలు ఉన్నాయి.

టవర్ మూగబోవడంతో వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు అంతా ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం నాతవరం వెళ్లిపోయి అక్కడ పనులు చేసుకుని వస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు సెల్‌టవర్ చేయాలని.. లేని పక్షంలో కలెక్టర్‌కు, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజరుకు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి విలేకరులకు తెలిపారు.



సరుగుడులో గల బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

చందనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు
- వీవీఐపీల దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

దొండపర్తి: సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం ఈ నెల 23న జరుగుతున్న దృష్ట్యా.. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సమక్షంలో చందనోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. చందనోత్సవం రోజు తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులతో పాటు దేవదాయశాఖ మంత్రి స్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. 3.30 నుంచి 4.30 గంటల మధ్య వీవీఐపీ దర్శనాలు, దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుల దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. కేటాయించే టికెట్లలో దర్శన సమయం ముద్రించి ఉంటుందన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకు ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్లపై భక్తులు దర్శనం చేసుకోవచ్చన్నారు. వీవీఐపీలకు స్లాట్-1 ఉదయం 5 నుంచి 7.00 గంటల మధ్య, స్లాట్-2 ఉదయం 8 నుంచి 10 మధ్య దర్శన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మీడియాకు ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య దర్శనం ఉంటుందన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ కొండపై, కొండ దిగువన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌పై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి 20 మీటర్లకు ఒక వాటర్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాటర్ బబుల్స్‌లో నీటిని పేపర్ గ్లాసుల ద్వారా సరఫరా చేయాలన్నారు. టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. కొండపై, దిగువన, పుష్కరిణి, భైరవ కోన, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాల్లో , నడక మార్గంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- సాక్షి సంపాదకుడు వర్ధెల్లి మురళి
- శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో ఉత్సాహంగా 'కేరింతలు 2023'

నక్కపల్లి/ పాయకరావుపేట: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాక్షి దినపత్రిక సంపాదకుడు వర్ధెల్లి మురళి అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో కేరింతలు 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రవైభవం పేరుతో తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ప్రయత్నంలో భాగంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థ కేరింతలు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు జాతికి సంబంధించి సాహిత్యం, ఆటపాటలు, కళారూపాలు, నడవడిక నియంత్రించే సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎన్నో ఉన్నాయని, జానపద కళారూపాలు, నృత్యాలు, భాష, వ్యాకరణం వంటి ఎన్నో అంశాలున్నాయని, ఇవన్నీ తెలుగుజాతి వారసత్వ సంపద అని పేర్కొన్నారు. వీటిని ప్రత్యేక శ్రద్ధ పెట్టి రక్షించుకోవాల్సిన పరిస్థితులు నేడు ఏర్పడ్డాయన్నారు. వైతాళికులు, కవులు, మన సంస్కృతిని నిలబెట్టుకోవాలని ముందుకు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు.





విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న సాక్షి సంపాదకుడు మురళి, ఆకట్టుకున్న విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన

తెలుగు జాతి ఎన్నో రంగాల్లో వెనుకబడి ఉందని, జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన కావ్యాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేడు సంస్కృతి మీద దాడి చేసే పరిణామాలు చాలా ఉన్నాయని, దీనిలో ముఖ్యంగా పిల్లలపై మొబైల్ ఫోన్‌ల ప్రభావం చాలా ఉందన్నారు. పిల్లలకు ఫోన్‌లకు బదులు డెస్క్ టాప్‌లు, చెత్త యాప్‌లు లేని ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. 18 ఏళ్ల వచ్చే వరకు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మనవి చేస్తున్నానన్నారు. మరో అతిథి డక్కన్ ఫైన్ కెమికల్స్ వైస్‌ప్రెసిడెంట్ ఆనందరావు మాట్లాడుతూ మనం పాటించే సంప్రదాయాలు ఆహార అలవాట్లలో కూడా సైంటిఫిక్ రీజన్ ఉందన్నారు. మంచి నడవడిక, ఆరోగ్యం, మంచి బుద్ధులు కలిగిన సంతానం కలిగి ఉన్నవాడే నిజమైన ఐశ్వర్యవంతుడన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే 800 మంది విద్యార్థులతో తెలుగు జాతి ఔన్నత్యాన్ని సంప్రదాయాన్ని నాటక పద్య, గేయ, నృత్యరూపంలో ప్రదర్శన ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అతిథులతో పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత నర్సింహరావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ మూర్తి ప్రోగ్రాం కన్వీనరు రత్నం, కో కన్వీనర్లు ప్రసూనా మౌళి, సంధ్యారాణి, డిఎల్‌పి రాజు, ఉషారాణి, పీఆర్‌వో పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1నుంచి 5 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఆంధ్రవైభవం పేరుతో తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా పద్య, గేయ, నాటక, నృత్య రూపాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

తాండవ రొయ్య.. అదిరిందయ్యా..!

- జాలర్లకు 'రొయ్యల పంట'
- జలాశయంలో రోజూ 300 మంది వేట
- ఇక్కడి రొయ్యలకు భలే గిరాకీ

గొలుగొండ: తాండవ జలాశయం వల్ల వేలాది మంది రైతులకే కాకుండా వందలాది మంది జాలర్లకు కడుపు నిండుతుంది. ఇక్కడ సాగు నీరు వల్ల వేలాది ఎకరాల్లో పంట సాగు జరుగుతుంది. అలాగే జలాశయంలో చేపలు, రొయ్యల వేట వల్ల తాండవ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వందలాది జాలర్లకు భుక్తి దొరుకుతోంది. ప్రస్తుతం రొయ్యల సీజన్ కావడం వల్ల జాలర్లకు మంచి ఆదాయం వస్తుంది.

సీజన్ మూడు నెలలే..

తాండవ జలాశయంలో చేపల వేట నిత్యం జరుగుతుంది. కానీ రొయ్యల సీజన్ మాత్రం మూడు నెలలు మాత్రమే ఉంటుంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మే చివరి వారం వరకు మాత్రమే రొయ్యల వేట సాగిస్తుంటారు. ఈ మూడు నెలల కాలంలో జాలర్లకు మంచి ఆదాయం వస్తుంది. మొదట్లో రొయ్యలు అంతగా దొరక్కపోయినా ప్రస్తుతం వేట బాగానే సాగుతోంది. ప్రతి రోజు తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు రొయ్యల వేట ముమ్మరంగా సాగుతుంది. సాయంత్రం సమయంలో కొంతమంది రొయ్యల వేట కోసం వెళుతుంటారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో రొయ్యలు వలలకు చిక్కవని జాలర్లు తెలుపుతున్నారు. రోజు 500 వందల నుంచి 700 రూపాయల వరకు ఆదాయం వస్తుందని అంటున్నారు. ఇక్కడ పడిన రొయ్యలు స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు.

స్కాంబియా రొయ్యలకు డిమాండ్

తాండవ జలాశయంలో సహజసిద్ధంగా ఉన్న రొయ్యలు స్కాంబియా రకానికి చెందినవి. ఈ రకానికి చెందిన రొయ్యలు రుచిగా ఉంటాయి. అందుకే వీటికి అంత డిమాండ్. నర్సీపట్నం, తుని, అనకాపల్లితో పాటు ఎక్కువగా రొయ్యలు పడిన సందర్భాల్లో ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు.

ఫిబ్రవరి చివరి వారం, మార్చి నెలలో మొదటి రెండు వారాలు రొయ్యల వేట సరిగ్గా సాగలేదు. దీనికి కారణం తాండవ జలాశయంలో నీరు అధికంగా ఉండడం. ప్రస్తుతం వేసవి కావడం నీరు కాస్త తగ్గుముఖం పట్టడం వల్ల వేట ముమ్మరంగా సాగుతోంది. కేజీ రొయ్యలు ఇక్కడ రూ.300లకు లభిస్తాయి. ఇతర ప్రాంతాల్లో వీటిని రూ.500 వరకు అమ్ముతారు. వెంకటాపురం, పాగచెట్లపాలెం, సాలికమల్లవరం, గొలుగొండ, జోగుంపేట, అమ్మపేట, గాదంపాలెం గ్రామాలకు చెందిన 300 మందికి పైగా జాలర్లు ఈ జలాశయంపై ఆధారపడి ఉన్నారు.



తాండవ జలాశయంలో వేట సాగిస్తున్న జాలర్లు (ఇన్‌సెట్) జలాశయంలో లభించే స్కాంబియా రొయ్యలు

జలాశయం వల్లే బతుకు తెరువు



తాండవ జలాశయంపై వందలాదిమంది ఆధారపడి ఉన్నాం. ప్రతిరోజు తెల్లవారే వేటకు వెళతాం. పట్టిన రొయ్యలను వ్యాపారులు ఇంటికి వచ్చి తీసుకువెళతారు. ఈ మూడు నెలల సీజన్‌లో కుటుంబాలను సంతోషంగా పోషిస్తున్నాం.

–రాజు, జాలరి, వెంకటాపురం

'చిల్లర' సమస్యకు చెక్

- క్యూఆర్ స్కాన్‌తో బస్ టికెట్
- జిల్లాలో ఆర్టీసీ నగదు రహిత సేవలు
- దూర ప్రాంతాలకు టిక్కెట్స్ కూడా డిజిటల్ విధానంలో
- జిల్లా వ్యాప్తంగా 200 బస్సుల్లో..

అనకాపల్లి టౌన్: గతంలో బస్ ప్రయాణమంటే సరిపడా నగదు జేబులో ఉందా.. లేదా...చూసుకోవడం.. తగిన చిల్లర లేకపోతే ఇబ్బంది పడేవారు. ఇటువంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు...

ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) నగదు రహిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు అందుబాటులో తెచ్చింది. ఈ సదుపాయంతో అటు కండక్టర్‌తో పాటు ఇటు ప్రయాణికులకు చిల్లర సమస్యకు చెక్ పెట్టింది. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల వాడకాన్ని కేంద్రం తీసుకురావడంతో మిగతా అన్ని క్రయవిక్రయాలు రెప్పపాటు సమయంలో ముగిసిపోతున్నాయి. ఇదే విధానాన్ని ఆర్టీసీ కూడా ప్రయాణికులకు చేరువ చేసింది. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవాలంటే సరిపడా నగదు పట్టుకొని బస్సు ఎక్కే పరిస్థితి నుంచి స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలులే... అనే ధీమాను కల్పించింది. ఇక నుంచి సదరు శాఖ క్యూఆర్ కోడ్‌పై ఫోన్ పేయాప్ ద్వారా ప్రయాణికులు స్కాన్ ఫోన్ నుంచి నగదు చెల్లించవచ్చు.

ప్రయాణానికి కావాల్సిందల్లా...

ఇకపై ప్రయాణికులు తమ స్మార్‌ఫోన్‌లో ఫోన్‌పే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ ఖాతాకు ప్రయాణికుడి బ్యాంకుకు అనుసంధానం చేసిన ఫోన్ నంబర్ జత పరిస్తే సరిపోతుంది. క్యూఆర్ కోడ్‌పై ఫోన్‌పే తెరిచి స్కాన్ చేస్తే జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం పేరు సరి చూసుకొని నగదు చెల్లించి సులభతరంగా ప్రయాణించవచ్చు.



క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ విధానంపై కండక్టర్‌కు అవగాహన కల్పిస్తున్న ప్రజారవాణాశాఖ అధికారి

నగదురహిత ప్రయాణం సులభం

నగదు రహిత ప్రయాణం సులభతరం. జిల్లాలో 200 బస్సుల్లో ఇప్పటికే తమ శాఖకు చెందిన క్యూఆర్‌కోడ్ ప్రవేశపెట్టాం. 50 క్యూఆర్‌కోడ్ టిమ్స్ అదనంగా ఉన్నాయి. రోజుకు రూ.26లక్షల ఆదాయం సమకూరుతోంది. 30 రూట్లలో బస్సులు తిప్పుతున్నాం. పల్లె వెలుగు బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రవేశపెట్టాం. ఈ పద్ధతి తెలియని వారికి టిక్కెట్ సదుపాయం కల్పిస్తాం. –కె.పద్మావతి, ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి

‘పీఎం శ్రీ’తో పాఠశాలల అభివృద్ధికి ఊతం

- మన స్కూళ్ల అభివృద్ధికి కేంద్రం సాయం
- తొలివిడత జాబితా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి విశాఖలో 44 స్కూళ్ల ఎంపిక

విశాఖ విద్య: విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సైతం ఇతోధికంగా సాయం అందించేందుకు ముందుకొస్తోంది. నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చేసిన తీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇదే క్రమంలో జాతీయ విద్యా విధానం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పాఠశాలల విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఏ ఒక్క స్కూల్ కూడా మూతపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్న తీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధికి ‘పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం’ కింద నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. దీనిలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి విడతగా 44 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ మేరకు ఎంపికైన పాఠశాలల జాబితా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు వెల్లడించారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులకు మంగళవారం సమాచారం వచ్చింది.

మౌలిక వసతులు పెంపు...

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. ఎంపికైన పాఠశాలల్లో ఏ మేరకు పనులు చేపట్టాలనే దానిపై జిల్లా స్థాయి కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి. పీఎం శ్రీ కింద విశాఖ జిల్లాలో 4, అనకాపల్లిలో 24, అల్లూరి జిల్లాలో 16 పాఠశాలలు తొలి విడత జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, బుచ్చెయ్యపేట మండలంలోని సీతయ్యపేట, చోడవరంలో జెడ్పీహెచ్‌ఎస్ లక్ష్మీపురం, దేవరాపల్లిలో జెడ్పీ హెచ్ఎస్ దేవరాపల్లి, గొలుగొండలో చీడిగుమ్మల జెడ్పీహెచ్ఎస్, కొంకోటలో కొంకోట (బాలురు), కోటవురట్లలోని కోటవురట్ల, మునగపాకలోని గణపర్తి, నక్కపల్లిలో వేంపాడు, నర్సీపట్నంలో వేములపూడి, పరవాడలో పరవాడ(బాలికలు), రావికమతంలో చినపాచిలి, రోలుగుంటలో రోలుగుంట, సబ్బవరంలోని సబ్బవరం, ఎస్.రాయవరంలో దార్లపూడి, యలమంచిలిలో ఏటికొప్పాక, నాతవరంలో డి. ఎర్రవరం, రాంబిల్లిలో రాంబిల్లి, మాకవరపాలెంలో గిడుతూరు, మాడుగులలో కింతలి, కె.కోటపాడు మండలంలోని అలమండ కోడూరు జెడ్పీ హైస్కూళ్లు, పాయకరావుపేటలో ప్రభుత్వ హైస్కూల్ పాయకరావుపేట, అచ్యుతాపురం మండలంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, చీడికాడ మండలం కోనాం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ చోటు దక్కించుకున్నాయి.

2 వేల లీటర్ల పులుపు ధ్వంసం



పట్టుబడిన బెల్లం పులుపు, పరికరాలతో ఎస్‌ఐ నారాయణరావు

కోటవురట్ల: నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. అన్నవరం శివారున సారా తయారీ కేంద్రంపై ఎస్‌ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన రెండు వేల లీటర్ల బెల్లం పులుపు, పాత్రలను ధ్వంసం చేశారు. ఎక్కడైనా సారా తయారీకి పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

సెల్‌ఫోన్ కోసం వివాదం

విద్యార్థి కంటికి గాయం

నర్సీపట్నం: నర్సీపట్నం రామారావుపేట బీసీ కళాశాల వసతి గృహంలో డిగ్రీ, పాలిటెక్నిక్ ఇద్దరు విద్యార్థుల మధ్య సెల్‌ఫోన్ వివాదం చోటు చేసుకుంది. వసతిగృహం విద్యార్థుల కథనం ప్రకారం.. ఎస్.రాయవరంకు చెందిన విజయ్‌బాబు వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గాజువాకకు చెందిన వెంకటసాయి వసతిగృహంలో ఉంటూ పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరు వేర్వేరు రూమ్స్‌లో ఉంటున్నారు. సాయి సెల్‌ఫోన్ పోవడంతో విజయ్‌బాబుపై అనుమానం వ్యక్తం చేశాడు. విషయం వార్డెన్ శ్రీనివాస్‌కు తెలియడంతో ఎవరైనా సెల్‌ఫోన్ తీసి ఉంటే ఇచ్చేయాలని చెప్పిన, రెండు రోజుల తర్వాత ఎవరో సాయి ఉంటున్న రూమ్‌లో సెల్‌ఫోన్ పెట్టేశారు. ఫోన్ దొరకడంతో విజయ్‌బాబు నన్ను ఎందుకు అనుమానించావని సాయిని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరు విద్యార్థుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో విజయ్‌బాబు కంటికి గాయమైంది. విషయం తెలుసుకున్న వార్డెన్, సిబ్బంది విజయ్‌బాబును ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు విద్యార్థి విజయ్‌బాబును ఏబీసీడబ్ల్యూవో ఛాముండేశ్వరరావు, వార్డెన్ విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. ఈ విషయమై ఏబీసీడబ్ల్యూవోను సంప్రదించగా విద్యార్థి కంటికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్టు పేర్కొన్నారు.



కంటికి గాయమైన విద్యార్థి విజయ్‌బాబు

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం ఆగ్రహం

రాష్ట్ర అసోసియేషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

నక్కపల్లి: జిల్లా హాకీ అసోసియేషన్‌లో ఏకపక్ష నిర్ణయాలు, తప్పుడు నిర్ణయాల వల్ల అంకితభావంతో ఆడుతున్న హాకీ క్రీడాకారులకు నష్టం జరుగుతోందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బుధవారం ఆయన నక్కపల్లిలో హాకీ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా హాకీ అసోసియేషన్ పనితీరు బాగానే ఉందన్నారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, యలమంచిలి క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం ఇచ్చారన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల ఎంపిక సందర్భంలో ఇటీవల అసోసియేషన్ వైఖరి వల్ల నక్కపల్లి ప్రాంత క్రీడాకారులకు సరైన సమాచారం ఉండటం లేదన్నారు. ఎంపికైన వారి జాబితా అర్ధరాత్రి సమయంలో విడుదల చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల వారు పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల యలమంచిలిలో అడ్‌హాక్ కమిటీ పేరుతో కొంత మంది వ్యక్తులు ఏకపక్షంగా హాకీ సెలక్షన్లు చేస్తున్నారని అన్నారు. వీరికి ఎవరు అనుమతి ఇచ్చారో జిల్లా హాకీ అసోసియేషన్, క్రీడా శాఖ వారు సమాధానం చెప్పాలన్నారు. ఈ కమిటీ వారు తమకు నచ్చిన వారిని ఎంపిక చేస్తూ నిజమైన క్రీడాకారుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ డాక్టర్ సత్యవతి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

ముస్లింలకు అండగా నాడు వైఎస్సార్.. నేడు జగన్



ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లింలతో మాట్లాడుతున్న ధర్మశ్రీ



యలమంచిలిలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కన్నబాబు రాజు తదితరులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే కన్నబాబురాజు

రావికమతం: ముస్లిం సోదరులకు నాడు వైఎస్ఆర్ నుంచి నేడు జగన్‌మోహనరెడ్డి వరకు అండగా ఉన్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బుధవారం రాత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు, సీఐ మహమ్మద్‌తో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు. నాడు మహానేత 4 శాతం రిజర్వేషన్లు కల్పించి ముస్లింలకు అండగా నిలవగా నేడు జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మిన్నగా గుండెల్లో పెట్టుకుంటున్నారన్నారు. షాదీఖానా, శ్మశాన వాటికలు నిర్మించాలని ముస్లిం పెద్దలు ధర్మశ్రీని కోరగా దశల వారీగా తప్పకుండా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చోడవరంలో మశీదు పునర్నిర్మాణానికి ఇప్పటికే రూ.40 లక్షలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. కొత్తకోట సీఐ వృత్తిపరంగానే కాక సేవా కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల మరమ్మతులు, ఆట స్థలాల అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రావికమతం మండల ఎంపీపీ పైల రాజు, రోలుగుంట ఎంపీపీ పోతల శ్రీనివాసరావు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక రంజాన్

యలమంచిలి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని యలమంచిలి పట్టణంలోని ముస్లిం సోదరులకు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కన్నబాబురాజు ఇఫ్తార్ విందు ఇచ్చారు. జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ పండగ ముస్లింల ఐక్యతకు ప్రతీక అన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద యలమంచిలి పట్టణంలో ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, ముస్లిం సంఘం సభ్యులు అబ్దుల్లా మాస్టర్, ఎస్కే వల్లీ, పీరు, బాషా, అబిబ్‌జిలానీ, బుఖారీ, తౌషిఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో స్నేహ ప్రతిభ



చిత్రలేఖనంలో ద్వితీయ స్థానం దక్కించుకున్న స్నేహ

రోలుగుంట: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో అనకాపల్లి తెలుగుతల్లి యువజన సంఘం అనకాపల్లి గవరపాలెం సతకంపట్టు దరి మాతృభాషా దినోత్సవం, ఉగాది పర్వదినం సందర్భంగా జరిగిన చిత్రలేఖన పోటీల్లో రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బొందల స్నేహ పాల్గొంది. ఈ పోటీల్లో ఆమె తన ప్రతిభ చూపించి ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఆమెకు ధ్రువపత్రంతో పాటు మెడల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు మాకిరెడ్డి నాని, కిరణ్, దారబాబుతో పాటు ఇతర ఉపాధ్యాయ బృందం ఆ విద్యార్థినిని అభినందించారు. తమ గ్రామానికి చెందిన విద్యార్థినికి జిల్లా స్థాయిలో బహుమతి దక్కడంపై జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీ రమణమ్మ, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ బొందల అర్జున ఆమెకు అభినందనలు తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

2 సెల్‌ఫోన్లు స్వాధీనం

మాడుగుల రూరల్: ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదానం ప్రాంతానికి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్టు స్థానిక ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపారు. బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి తాటిపర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక, మైసూరి జిల్లాకు చెందిన ఎం. శ్రీనివాస్(55), జి.మాడుగుల మండలం రాచపుట్టుకు చెందిన కొర్రా రాజారావు(42) నుంచి 5 కిలోలు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఎండీపీఎస్ చట్టం కింద ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

అందుబాటులో లింగ నిర్ధారిత టీకా

- ఈ టీకాతో ఆడపెయ్యిలు జననం
- టీకా ఖరీదు రూ.500
- కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ డా. భైరాగి



దేవరాపల్లి పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ భైరాగి

దేవరాపల్లి: లింగ నిర్ధారిత వీర్యంతో ఆవులు, గేదెలకు తప్పనిసరిగా ఆడ పెయ్యిలు జన్మిస్తాయని, దీనిని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ డా.జి.భైరాగి అన్నారు. ఈ మేరకు దేవరాపల్లి పశువైద్యశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పశువులకు అందిస్తున్న సేవలపై స్థానిక పశువైద్యాధికారి ఎస్. అలేఖ్యను ఆయన ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు దేవరాపల్లి,నాగయ్యపేట ఆర్‌బీకేలను సందర్శించి పశువులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం కోసం రైతు రూ. 500 చెల్లిస్తే మొదటి డోస్‌కు గర్భం దాల్చకపోతే రెండో డోస్ ఉచితంగా వేస్తామన్నారు. రెండు డోస్‌లలో గర్భం దాల్చకపోతే రైతుకు రూ. 500 తిరిగి చెల్లిస్తామన్నారు. దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల పరిధిలో గాలి కుంటు వ్యాధి టీకా కార్యక్రమం 80 శాతం మేర పూర్తయిందన్నారు. ఈ ఏడాది రెండు మండలాల పరిధిలో సంపూర్ణ మిశ్రమ దాణాను 60 శాతం రాయితీపై 200 టన్నుల దాణాను 120 మంది పాడి రైతులకు అందజేశామన్నారు. 75 శాతం రాయితీపై 8 టన్నుల పశు గ్రాస విత్తనాలను అందజేశామన్నారు. గడ్డి కోత యంత్రం అసలు ధర రూ. 33,970 కాగా 40 శాతం రాయితీపోను 20,382 రూపాయలకు 8 మంది రైతులకు అందజేశామన్నారు. వైఎస్సార్ సంచార వైద్య సేవ ద్వారా 1962 కాల్ సెంటర్ ద్వారా పశువులకు శస్త్రచికిత్స, గర్భకోశ వ్యాధులు, పశువులకు తీవ్రమైన గాయాలైన సందర్భంలో రైతులకు చెంతకే వెళ్లి వైద్య సేవలందిస్తామన్నారు. టెలీ మెడిసన్ ద్వారా వైద్య సేవలందిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాలలో పశు విజ్ఞాన పడి కార్యక్రమంలో భాగంగా మేలు జాతి పశుగ్రాసం పెంపకం, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు సంరక్షణ, వ్యాధులు నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

పాడిరైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయం



చందనాడలో రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ ఆనంద్

నక్కపల్లి: లాభాపేక్షలేకుండా పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పని చేస్తోందని చైర్మన్, రాష్ట్ర సూక్ష్మ, మధ్య, చిన్న, తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజక సమన్వయకర్త ఆడారి ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన చినదొడ్డిగల్లు బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ పరిధిలో చందనాడ, ఉపమాక తదితర గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను పరిశీలించారు. పాడిరైతుల సమస్యలు, సంఘాల పనితీరును బోర్డు డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ చైర్మన్‌కు వివరించారు. అనంతరం ఉపమాకలో జరిగిన పాడిరైతుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసమే తన తండ్రి ఆడారి తులసీరావు విశాఖ డెయిరీని స్థాపించారన్నారు. ఈ సందర్భంగా ఉపమాకలో 10 వ్యవసాయ బోర్లు, దేవస్థాన ప్రాంగణంలో కల్యాణ మండపం, శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరారు. ఇక్కడ పాలసేకరణ కేంద్రంలో ప్రొడ్యూసర్ యావరేజ్ 1.5 లీటర్ల నుంచి 5 లీటర్ల సరాసరి వచ్చినట్లయితే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చందనాడలో పాల ఉత్పత్తిదారుల కోరిక మేరకు ఉమ్మడి ఖాతా నుంచి ప్రతి 15 రోజులకు చెల్లిస్తున్న పాలబట్వాడా చెల్లింపులకు సరైన నిల్వలు లేని కారణంగా ఈ సంఘం ఖాతాకు రూ.5 లక్షల రివాల్వింగ్ ఫండ్ డెయిరీ నుంచి సమకూరుస్తున్నట్లు ప్రకటించారు. పాల సరఫరా సగటున 10 లీటర్లకు పెంచినట్లయితే సంఘానికి డెయిరీ నిధులతో సొంత భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. డీజీఎం పాండ్యరాజన్, సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి కొండబాబు, తుని యూనిట్ మేనేజర్ ఎం. శ్రీను, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, సూపర్‌వైజర్ కిరణ్, రైతు నాయకులు కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై మేడివాడ ప్రజల ఆందోళన

రావికమతం: తమ గ్రామంలో ఎప్పటి నుంచో లోవోల్టేజీ సమస్య ఉందంటూ మేడివాడ గ్రామ ప్రజలు రావికమతం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదంటూ నిరసన తెలిపారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించారు. గ్రామంలో 2,500 సర్వీసులతో పాటు రైస్ మిల్లులు, రెండు మంచినీటి పథకాలు ఉన్నాయన్నారు. తరచూ లోవోల్టేజీ కారణంగా మంచినీటి పథకం మోటార్లు పని చేయక నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో అల్లాడుతున్నామని తెలిపారు. తమ గ్రామానికి లైన్‌మేన్ కూడా లేడని, ఇన్‌చార్జిగానైనా ఎవరినైనా వేయాలని మొరపెట్టుకున్నా స్పందించలేదంటూ మండి పడ్డారు. 24 గంటల్లోగా సమస్య పరిష్కరించకుంటే సబ్‌స్టేషన్ లోనే వంటావార్పు చేస్తామని, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీంతో లైన్ ఇన్‌స్పెక్టర్ తాతబాబు వారికి సర్ది చెప్పి ఈ రోజే ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తెనుగుపూడిలో బాలుడు అదృశ్యం

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడికి చెందిన బాలుడు షేక్ అబ్దుల్ కలాం (17) అదృశ్యమయ్యాడని తండ్రి షేక్ నూర్ సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పదవ తరగతి వరకు చదువుకున్న అబ్దుల్ కలాం తర్వాత నుండి ఇంటి వద్దనే ఉంటున్నాడు. పదమూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమంలో అబ్దుల్ కలాం ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పటి నుండి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత వెదికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో అబ్దుల్ కలాం తండ్రి నూర్‌సాహెబ్ బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరికైనా బాలుడి ఆచూకీ తెలిస్తే 9440796092 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

నూతన పెయింటింగ్ మిషన్ ప్రారంభం



హయ్‌సా మిషన్‌ను ప్రారంభిస్తున్న పెడిలైట్ ఎండీ భరత్‌పూరి

తుమ్మపాల: పెడిలైట్ రంగులతో భవనాలకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని కంపెనీ ఎండీ భరత్‌పూరి అన్నారు. పట్టణంలో నాలుగురోడ్ల కూడలి వద్ద గల సంస్థ శాఖలో నూతనంగా రూపొందించిన హయ్‌సా పెయింటింగ్ మిషిన్‌ను ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన ఈ మిషన్‌ను ఇక్కడి నుంచి దేశానికి పరిచయం చేస్తున్నామన్నారు. భవనాలు, ఇంటీరియర్‌లో కూడా వాటర్ ప్రూఫ్ కలిగిన రంగులను అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న పట్టణాల ద్వారానే తమ సరికొత్త టెక్నాలజీని దేశానికి అందిస్తున్నామన్నారు. సీబీవో సలీల్, ప్రెసిడెంట్ విశాల్‌మల్హాన్, వైస్ ప్రెసిడెంట్ అమిత్, జోనల్ మేనేజర్ వి.రవికుమార్ పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కూర్మన్నపాలెం: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన ముత్తా శేఖర్(31) బతుకుదెరువు కోసం ఐదు నెలల కిందట హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 17న హైదరాబాద్ నుంచి తన సొంతూరుకు బయలుదేరాడు. హైదరాబాద్‌లో అతని బాబాయ్ సాగర్ బస్సు టికెట్ తీసి.. బస్సు ఎక్కించి పంపాడు. 18వ తేదీన ఇంటికి శేఖర్ రాకపోవడంతో.. అతని అన్న రవికుమార్ ఆందోళన చెందాడు. శేఖర్‌కు ఫోన్ చేసినా సమాచారం లేకపోవడంతో.. బాబాయ్‌ను సంప్రదించాడు. అతని బస్సు టికెట్ వివరాలను రవికుమార్‌కు పంపాడు. ఆ టికెట్ ఆధారంగా డ్రైవర్‌ను కలవడంతో.. శేఖర్ 18న ఉదయం 11 గంటలకే వడ్లపూడిలో దిగినట్లు సమాచారం అందించాడు. దీంతో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో.. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. వడ్లపూడి రహదారి పక్కన ఉన్న బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని బుధవారం ఉదయం గుర్తించిన పాదచారులు దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న పర్స్, సెల్‌ఫోన్ ఆధారంగా రవికుమార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి.. శేఖర్‌గా గుర్తించారు. శేఖర్ మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. రవికుమార్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. శేఖర్‌కు ఎవరైనా శత్రువులు ఉన్నారా? బస్సు దిగిన తర్వాత ఎవరిని కలిశాడు? తదితర విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా

నేడు నూకాంబిక నెల పండగ



కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయంలో గురువారం గంధం అమావాస్య ఉత్సవం(నెల పండగ) నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వేగి శివగణేష్, వేగి రామరాజు బుధవారం తెలిపారు. పండగ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

నేడు, రేపు 'గడప గడపకు'

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ విలీన గ్రామాలైన రాజుపాలెం, ఎరుకువానిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ విలీన గ్రామాలైన వల్లూరు, గొర్లివానిపాలెం గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ రెండు కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటరీర్లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



నరసింగబిల్లిలో ఇంటింటికి వెళ్లి త్రైత సిద్ధాంతంపై ప్రచారం చేస్తున్న సభ్యులు

కశింకోట : ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, ఇదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని విశాఖపట్నం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో బుధవారం సమితి ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సాంద్ర సింధు వేద సారాంశాన్ని వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఆత్మ ఆరాధన ధర్మ స్థాపనకు మార్గంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు చంద్రబాబు, సర్వధారజ్‌రమణ, సన్నీ, అక్షయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
డంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,593 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,950	4,150
మొదటి రకం	3,800	4,090
రెండో రకం	3,450	3,780
మూడో రకం	3,330	3,420

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి సాగు.. ఆరోగ్యం బాగు

ఆరోగ్యకరమైన పంటల చిరునామా ప్రకృతి వ్యవసాయం. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. అదనంగా మూడు గ్రామాలను ప్రకృతి వ్యవసాయ సాగుకు తాజాగా ప్రభుత్వం ఎంపిక చేసింది. దీంతో మండలంలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెరగనుంది. ఇప్పటికే మండలంలోని 10 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారు.



నూతలగుంటపాలెం వద్ద ప్రకృతి వ్యవసాయంలో చేరనున్న పంట భూములు

- ప్రకృతి వ్యవసాయంపై ప్రభుత్వ ప్రోత్సాహం
- ప్రస్తుతం 10 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం
- కొత్తగా మరో మూడు గ్రామాల్లో సాగుకు ఆదేశాలు

కశింకోట : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించడంతోపాటు, పంట భూములను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. 2018లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దీన్ని ప్రారంభించింది. అంతంత మాత్రంగా ఉన్న ప్రకృతి వ్యవసాయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు.

చిరు ధాన్యాల సాగు ప్రోత్సాహక చర్యలు చేపట్టారు. దీంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి కనబరచడం మొదలెట్టారు. ప్రభుత్వం మరింతగా రైతులకు అవగాహన కల్పించేందుకు పంట భూమి కలిగివున్న స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని తీసుకుంది. వీరితోపాటు ఇతర రైతులకు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కలిగిస్తూ పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు.

కొందరు పూర్తిగా.. కొందరు పాక్షికంగా

వరి, చెరకు, కూరగాయలు, బొప్పాయి, ఉద్యానవన పంటలు ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొందరు పూర్తిగాను, మరికొందరు పాక్షికంగాను ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో 1802 ఎకరాల్లో 1957 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించినట్లు అధికారిక సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ఈ ఏడాది నుంచి మరింతగా ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా నవ ధాన్యాలు, 30 రకాల చిరు ధాన్యాలను ప్రకృతి సిద్ధంగా పండించి భూముల సారాన్ని పెంచడంతోపాటు, ఆరోగ్యకర ఉత్పత్తుల్ని అందించాలని నిర్దేశించింది. దీనిలో భాగంగా ఈ ఏడాది మండలంలోని నూతలగుంటపాలెం, విసన్నపేట, రామన్నపాలేన్ని కూడా ప్రకృతి సాగుకు ఎంపిక చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ఎంత విస్తీర్ణంలో సాగు చేయన్నారని ప్రస్తుతం వివరాల సేకరణలో సిబ్బంది ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయ విధానంతో బొప్పాయి సాగు



ఆనపకాయల సాగు



కూరగాయల సాగు

ఏడాదిగా ప్రకృతి సాగు



ఏడాదిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. సుమారు అర ఎకరం భూమిలో బొప్పాయి నాటి సేంద్రియ ఎరువుల ద్వారా మొక్కల్ని పెంచుతున్నాం. ప్రస్తుతం బొప్పాయి మొక్కలు ఎదుగుదల దశలో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజలకు ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు అందించడంతోపాటు, భూమి సారాన్ని మరింతగా సంరక్షించుకోవచ్చు.

–డి.సత్యనారాయణ, రైతు, జి.భీమవరం

ఆవుల కొనుగోలుకు రుణాలివ్వాలి



ఎకరం భూమిలో ప్రకృతి సిద్ధంగా కూరగాయలు పండిస్తున్నాం. జీవామృతం, ఘన జీవామృతం వంటి ఎరువుల తయారీకి అవసరమైన పేడ, మూత్రం కోసం ఆవుల కొనుగోలుకు రుణాలు ఇవ్వాలి. ద్రవ జీవామృతం, కషాయాలు వగైరా తయారు చేయడానికి డ్రమ్ములు, పరికరాలు సమకూరిస్తే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కిల్లాడ సింహాచలం, రైతు, జి.భీమవరం

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మండలంలో 10 గ్రామాల్లో, 1957 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో 1802 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం పూర్తిగాను, పాక్షికంగాను చేశారు. ఈ ఏడాది కొత్తగా నూతలగుంటపాలెం, విసన్నపేట, రామన్నపాలెం గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. దీంతో సాగు విస్తీర్ణం, రైతులు మరింతగా పెరగనున్నారు.

–డి.రమణ, ఎల్1, ప్రకృతి వ్యవసాయం, కశింకోట మండలం

జగనన్నే మళ్లీ సీఎం



జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో రాసుకుంటున్న దాడి రత్నాకర్

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ప్రజలు జగనన్న ప్రభుత్వంపై చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని, రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గృహ పట్టాలను అందుకున్న ప్రతీ వ్యక్తికి ఆరు మాసాల్లో గృహాలు పూర్తి స్థాయిలో నిర్మించి ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. అర్హులై ఉండీ పథకాలు అందని వారి వివరాలు తెలుసుకుని, వీలైనంత వేగంగా వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతీ గృహానికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని 5 ప్రశ్నలకు లబ్ధిదారుల నుంచి సమాధానాలు అడిగి, రాసుకున్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నేతలు శిలపరశెట్టి బాబి, పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు, కె.ఎం. నాయుడు, సచివాలయం కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

24న మోదీ పాలనకు వ్యతిరేకంగా సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఎస్ దత్తు, పార్టీ నాయకులు

అనకాపల్లిటౌన్ : మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 24న జై భారత్ సత్యాగ్రహ దీక్షను నిర్వహించనున్నట్లు పీసీసీ రాష్ట్ర సభ్యుడు పి.ఎస్.దత్తు తెలిపారు. స్థానిక పూల్‌బాగ్ రోడ్డులోని తన స్వగృహంలో సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గడచిన 9 ఏళ్లలో బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లో సత్యాగ్రహ దీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు మలపు రెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అక్రమంగా వేసిన పార్లమెంట్ సభ్యత్వం రద్దుపై దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు వివిధ రాజకీయ పార్టీల నేతలు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కాళ్ల వెంకట సత్యనారాయణ, సూరా శ్రీనివాస్, సేనాపతి రాజు, కత్తెర శ్రీధర్, కె.వి.మాణిక్యం, సూరిశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలపై రైతులకు అవగాహన



వ్యవసాయ విద్యార్థినులతో శాస్త్రవేత్తలు, నైరా కళాశాల ప్రొఫెసర్లు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో వ్యవసాయ సాగులో మెలకువలపై రైతులకు నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నైరా కళాశాల ప్రొఫెసర్లు, కొండెంపూడి శాస్త్రవేత్తలు హరిపాలెం సందర్శించి రైతులకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ఈ ప్రాంతంలో రైతులు పండిస్తున్న పంటలు, సాగు విధానాలను తెలుసుకున్నారు. నైరా కళాశాల ఏడీ శ్రీనివాస్, ఏడీఆర్ స్పందన, కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్త రాజ్‌కుమార్, డాక్టర్ ఎస్.కిశోర్‌కుమార్, వ్యవసాయ విద్యార్థినులు తులసీ, శ్రావణి, ప్రమీల, యామినీ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలో రాళ్లపై అవగాహన



వైద్యుడు శ్రీధర్‌ను సత్కరిస్తున్న పరిషత్ కమిటీ

అనకాపల్లిటౌన్ : క్రియాటిన్ పరీక్షలు చేసుకోవడం ద్వారా శరీరంలో కిడ్నీ పనితీరును తెలుసుకోవచ్చని ప్రముఖ యూరాలజిస్ట్ పి.శ్రీధర్ అన్నారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో బుధవారం భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులు ప్రోస్టేట్ గ్రంథి వాపు వల్ల వచ్చే సమస్యలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వైద్యుడు శ్రీధర్‌ను పరిషత్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఏ.ఓంరామ్, కార్యదర్శి ఎస్.ఏ.బి.శర్మ, కోశాధికారి డి.శివరామ్, సీనియర్ సభ్యులు ఎస్.గోపాలరావు, పి.నిర్మల, కె.వి.గౌరీపతి, ఏవీ బ్రహ్మానందం, మూర్తి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలని వినతి



జెడ్సీ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

అనకాపల్లిటౌన్ : పట్టణం నడిబొడ్డున గృహసముదాయలు, జీవీఎంసీ జోనల్ కార్యాలయ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జోనల్ కమిషనర్ పి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. పట్టణ పరిధిలో అనధికారికంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని, జిల్లా ప్రధాన కేంద్రంలో ఉన్న డంపింగ్ యార్డుతో పరిసర ప్రజలు నిత్యం వ్యాధులకు గురవుతున్నారని, దీన్ని పట్టణానికి దూరంగా తరలించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు కోట్ని సూరిబాబు, మంగా ఈశ్వర్, విల్లూరి హరి, దుడ్డు నాగేశ్వరరావు, మజ్జి సత్య, మద్దాల రాంజీ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు



ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న నరసింగరావు

అనకాపల్లిటౌన్ : మానవుని తప్పిదాల కారణంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అగ్నిమాపకశాఖ పట్టణ అధికారి బి.నరసింగరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు పూడిమడక రహదారి డాక్టర్ బెనర్జీ ఆస్పత్రిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు దగ్గరలో ఫైర్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, గృహాల్లో వంట పూర్తయ్యాక గ్యాస్ సిలెండర్ రెగ్యులేటర్‌ను సరిగా ఆఫ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్లబ్ సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, పట్టణ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు తమ వంతు సహాయం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ కోరారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో 10 సంవత్సరాలుగా వేసవిలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులు, చిన్నారులు అత్యవసర సమయంలో మాత్రమే ఆరుబయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బుద్ధ కాశీ, సభ్యులు మళ్ల చంద్రశేఖర్, రవి, ఆళ్ల రామకృష్ణ, ఆళ్ల శ్రీనివాస్, కొణతాల ఉమ, సరిసా రమేష్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల స్ఫూర్తి గౌతు లచ్చన్న



గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విత్తనాల పోతురాజు

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో గౌతులచ్చన్న చిత్రపటానికి బీసీ సంఘాల సీనియర్ నాయకుడు విత్తనాల పోతురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నాయకులు ఎస్.సత్యనారాయణ, జి.వెంకటేశ్వర్లు, దేముడుబాబు, నారాయణ, కోన శ్రీను, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. నరసింగబిల్లి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్లే లారీ మంగళవారం సాయంత్రం ఢీకొంది. దీంతో యలమంచిలి మండలం కొక్కిరాపల్లికి చెందిన జాగారపు పెద్దప్ప తీవ్రంగాను, స్నేహితుడు శ్రీను స్వల్పంగాను గాయపడ్డారు. పరవాడ నుంచి నరసింగబిల్లిలో ఉన్న అత్తారింటికి పెద్దప్ప వెళుతుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. బుధవారం పెద్దప్ప తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నూకాంబికకు అమావాస్య పూజ

- పూజలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అమ్మవారికి పూజ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం నెల పండగలో భాగంగా బుధవారం అమ్మవారికి అర్చకులు అమావాస్య పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో 15 కోలాట బృందాలు కోలాటమాడుతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాయి. భారతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైద్యుడు రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, యువ నేత దాడి జయవీర్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని పూర్తి చేయడానికి పంచాయతీ పాలక వర్గం బుధవారం తీర్మానించింది. కల్యాణ మండపాన్ని పూర్తి చేయానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సిఫార్సు మేరకు అరబిందో పరిశ్రమ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన సమావేశంలో పంచాయతీ పాలక వర్గం ఆమోదం తెలిపింది. సమావేశంలో సర్పంచ్ రెల్లి నాగయమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండుతున్న సూరీడు

కశింకోట : కశింకోట ప్రాంతంలో బుధవారం అధిక ఉష్ణోగ్రతతోపాటు వడగాల్పులు వీయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి మధ్యాహ్నం వరకు వడగాల్పులు వీచాయి. దీంతో ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావడానికి సాహసించలేదు. వృద్ధులు, పిల్లలు ఇబ్బందులకు గురయ్యారు.

గడప గడపకు సంక్షేమం

- వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గెలిపించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వృద్ధునితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

అనకాపల్లిటౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడమే కాకుండా, మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. మండలంలోని కొప్పాక, కేఎస్ఆర్ పేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్‌కు ఆయా గ్రామస్తులు నీరాజనాలు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలతోపాటు గ్రామ, పట్టణాభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. స్థానికులు కొందరు కలిసి జగనన్న ఇళ్ల పథకంలో 15 మందికి కొత్తూరు కాలేజీ అవతల స్థలాలు ఇచ్చారని, అంతదూరం వెళ్లలేమని, తమకు గొలగాం గ్రామంలో పట్టాలిప్పించాలని మంత్రిని వేడుకున్నారు. అక్కడే ఉన్న అధికారులను పిలిచి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టిడ్కో గృహాల కోసం డీడీలు కట్టిన కొందరికి ఇళ్లు మంజూరు కాలేదన్న సమస్యపై సచివాలయ సిబ్బంది నుంచి ఇళ్ల జాబితా తీసుకుని పరిశీలించారు. అర్హత ఉండి డీడీలు కట్టినవారికి ఇళ్లు మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరమణ తన సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు పనులకు మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, 84వ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.